నియామకం


గంజి రఘునాథ్

గోల్కొండ: కార్వాన్ పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడిగా గంజి రఘునాథ్ నియామకమయ్యారు. శనివారం కార్వాన్‌లో జరిగిన సంఘం సమావేశంలో కుల పెద్ద కె.పాండయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఉత్తరపల్లి దయానంద్, ఉపాధ్యక్షుడిగా జే జితేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా..


నియామక పత్రం అందుకుంటున్న ఉదయ్ కిరణ్ రెడ్డి

చాంద్రాయణగుట్ట: బహదూర్‌పురా నియోజకవర్గ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా ఎం.ఉదయ్ కిరణ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవ రెడ్డి, బీజేపీ చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఉత్సవ సమితి గ్రేటర్ కార్యదర్శి కౌడీ మహేందర్ శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది పాతబస్తీలో గణేశ్ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

గృహిణి అదృశ్యం


ఫర్హానా బేగం

గౌలిపురా: గృహిణి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా రోడ్డు నంబర్–3 ప్రాంతానికి చెందిన మహ్మద్ సలావుద్దీన్, ఫర్హానా బేగం (32)లు దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు. కాగా ఈ నెల 14వ తేదీన 7.30 గంటలకు ఫర్హానా బేగం పని నిమిత్తం ఇంటి నుంచి బయటికు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త, కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో భర్త సలావుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 040–27854798 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

‘జీరో మస్కిటోస్‌- జీరో డెంగీ’ పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నాంపల్లి: జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ‘వలంటీర్ హీరోస్’ కార్యక్రమంలో భాగంగా రెడ్‌హిల్స్ డివిజన్‌లో దోమల నియంత్రణకు ‘జీరో మస్కిటోస్‌- జీరో డెంగీ’ అనే అంశంపై శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శిశు సదన్ హైస్కూల్ విద్యార్థులు వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. మస్కిటో ఫాగింగ్ ఏఈ లక్ష్మీదాసుపల్లి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ మహ్మద్ నూరుల్లా ఖాన్, సామాజిక కార్యకర్త మహ్మద్ అబిద్ అలీ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలి


చిన్నారెడ్డికి మెమోరండం అందజేస్తున్న శివకుమార్, సుమన్‌కుమార్

అబిడ్స్: చుడిబజార్‌లోని కమ్యూనిటీ హాల్ పనులు త్వరగా పూర్తి చేయాలని మాదిగ బంధుమిత్ర సంఘం నాయకులు సుమన్‌కుమార్, అల్వాల్ శివకుమార్, అనిల్‌కుమార్, నాగరాజు, వేణు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే చైర్మన్ చిన్నారెడ్డికి మెమోరాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీహాల్ పనులను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తి చేయలేదన్నారు. వెంటనే స్థానికుల సౌకర్యార్థం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు.

నియామకం


వెంకటేశ్ యాదవ్‌ను సన్మానిస్తున్న చైర్మన్ తదితరులు

అఫ్జల్‌గంజ్: గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడిగా ఉస్మాన్‌షాహి ప్రాంతానికి చెందిన బోయిని వెంకటేశ్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం సంఘం చైర్మన్ చిట్టబోయిన నందకిశోర్ యాదవ్, నాయకులు కిషన్ యాదవ్, పాండూ యాదవ్, శైలేందర్ యాదవ్ తదితరులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే రానున్న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని త్వరలో గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం జాంబాగ్ పూర్తి స్థాయి కమిటీని ప్రకటిస్తామన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన నందకిశోర్ యాదవ్, రాష్ట్ర ట్రస్ట్ బోర్డు సభ్యులు కిషన్ యాదవ్, గోపాల్ యాదవ్, మేకల రాజేందర్, మనీశ్ యాదవ్, రామారావు యాదవ్, కిషన్ యాదవ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కోల్‌కతా ఘటనపై వైద్యుల గరం

పెద్ద ఎత్తున నిరసనలు, ప్లకార్డుల ప్రదర్శన

- అత్యవసర సేవలు మినహా అన్నీ బంద్
- ‘నో జస్టిస్..నో డ్యూటీ’ అంటూ నినాదాలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న డాక్టర్లు, నర్సులు


నిలోఫర్‌లో నిరసన తెలియజేస్తున్న వైద్యులు, నర్సులు

నాంపల్లి: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్యకు నిరసనగా నిలోఫర్ ఆసుపత్రిలో వైద్యులు శనివారం నిరసన చేపట్టారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు జూనియర్ డాక్టర్లు, నర్సులు విధులు బహిష్కరించారు. అత్యవసర సేవలు మినహా మిగితా వాటిని పూర్తిగా నిలిపివేశారు. ‘నో జస్టిస్..నో డ్యూటీ’ అంటూ నినాదాలు చేపట్టారు. సెంట్రల్ ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు జూడాలకు మద్దతుగా తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. దీంతో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో వైద్యులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన గళాన్ని వినిపించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని నిందితులను కఠినంగా శిక్షించాలని డాక్టర్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. వైద్య రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని లేకుంటే అత్యవసర సేవలను సైతం స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఆశిష్, ప్రభుత్వ వైద్యుల సంఘం నేత డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రి వైద్యులు..

గోల్కొండ: గోల్కొండ ఏరియాసుపత్రి వైద్యులు విధులు బహిష్కరించి ప్లకార్డులు పట్టుకుని ఆసుపత్రి నుంచి గోల్కొండ కోట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోట వద్ద ఏరియాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఈ ఉదంతాన్ని ఏ పార్టీ కూడా రాజకీయం చేయకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. అదేవిధంగా నానల్‌నగర్‌లోని ప్రీమియర్ ఆసుపత్రి వైద్యులు నర్సింగ్, వైద్య సిబ్బందితో కలిసి ప్లకార్డులతో ఆసుపత్రి నుంచి రింగ్ రోడ్డు వరకు ర్యాలీ తీశారు.

ఉస్మానియా డెంటిస్టు విద్యార్థులు..

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా దంత కళాశాల విద్యార్థులు శనివారం అఫ్జల్‌గంజ్‌లోని కళాశాల నుంచి చార్మినార్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుండి తిరిగి దంత వైద్యశాల వరకు ర్యాలీ నిర్వహించారు.

ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వైద్యులు..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీలోని అఫ్జల్‌సాగర్ ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం వైద్యులు, సిబ్బంది ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి సువర్ణ, ఏఎన్‌ఎం లు విజయలక్ష్మి, శారద, ప్రేమలత, శైలజ, గోవింద్‌రాజు, భారతి, భవాని, పద్మ, సరోజ, ఇందమ్మ, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



పేట్లబురుజు ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆసుపత్రిలో..

దూద్‌బౌలి: పేట్లబురుజు ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆసుపత్రిలో జూడాలు, పీజీ డాక్టర్లు ఉదయం 9 గంటలకు ఓపీ ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. ప్ల కార్డులతో ఆసుపత్రి నుంచి నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ రజినీ రెడ్డి మాట్లాడుతూ.. పేట్లబురుజు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేశామని తెలిపారు.

కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రిలో..

సుల్తాన్‌బజార్: కోఠిలోని ఈఎన్‌టీ ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, ఇతర దవాఖానాల్లో వైద్య సేవలకు బ్రేక్‌పడ్డాయి. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనలు తెలిపారు. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మహిళా సాధికారత సంఘం అధ్యక్షురాలు శశిశ్రీ నేతృత్వంలో కోఠి డీఎంఈ వద్ద నిరసనల తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విజయ నిర్మల, డాక్టర్ అనిత, డాక్టర్ శీల, సుజాత పాల్గొన్నారు.

ఉదయ్ ఓమ్ని ఆసుపత్రి ఎదుట..

గన్‌ఫౌండ్రీ: అబిడ్స్‌లోని ఉదయ్ ఓమ్ని ఆసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. వైద్యురాలి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్లు డాక్టర్ రాఘవ, డాక్టర్ జయ ప్రకాశ్ మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


ఓపీ విభాగం వద్ద వేచి ఉన్న రోగులు

అటు నిరసనలు.. ఇటు అవస్థలు..!

అఫ్జల్‌గంజ్ /నాంపల్లి: దేశవ్యాప్తంగా మూడు రోజులుగా జూనియర్ డాక్టర్లు చేపడుతున్న నిరసనలు తీవ్రం రూపం దాల్చుతున్నాయి. శనివారం ఉస్మానియా మెడికల్ కాలేజీ, ఉస్మానియా డెంటల్ కాలేజీలో జూడాలు, నిలోఫర్ ఆసుపత్రిలో డాక్టర్లు విధులు బహిష్కరించడంతో రోగులు మరింత ఇబ్బందులు పడ్డారు.


వైద్య సేవల కోసం నిరీక్షిస్తున్న రోగులు


గోల్కొండ ఏరియాసుపత్రి ఎదుట ప్లకార్డులు ప్రదర్శన..


ప్రీమియర్ ఆసుపత్రి వైద్యులు..


కోఠి ఈఎన్‌టీ ఆసుపత్రి వద్ద నిరసన ..


కోఠి డీఎంఈ వద్ద నిరసన ..

మజ్లిస్‌లో యువతకు ప్రాధాన్యం


సమావేశంలో పాల్గొన్న మజ్లిస్ కార్పొరేటర్లు

గోల్కొండ: మజ్లిస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ అన్నారు. టోలిచౌకీ టూమ్స్ రోడ్ చౌరస్తాలోని రాయల్ టింబర్స్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ సెక్యూలర్ విధానాలను నమ్ముతూ ముందుకు సాగుతుందన్నారు. పేద, బలహీన వర్గాల వారికి మెరుగైన విద్యను పార్టీ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ నసీరుద్దీన్, హుసేనా పాషా, నవాజ్, సాహిల్, నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమాతో పాటు రాయల్ టింబర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆసిఫ్, తెలంగాణ ఫ్యామిలీ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ తదితరులు ఉన్నారు.

అవార్డులతో మరింత బాధ్యత


అవార్డు గ్రహీతలతో నిర్మలా జగ్గారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: అవార్డులతో మరింత బాధ్యత పెరుగుతుందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. రవీంద్రభారతీలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ వాయిస్ స్టూడియో ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి తెలంగాణ ఐకాన్ అవార్డులను శనివారం అందజేశారు. అంతకు ముందు పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జ్యోగిని శ్యామల, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర అధ్యక్షులు వేములవాడ మదన్ మోహన్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రమేశ్, కిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించడంలో మమతా బెనర్జీ విఫలం


మమతాబెనర్జీ ఫ్లెక్సీని దహనం చేస్తున్న కార్పొరేటర్

జియాగూడ: కోల్‌కతా మహిళా వైద్యురాలి హంతకులను శిక్షించడంలో అక్కడి ప్రభుత్వం విఫలమైందని గన్‌ఫౌండ్రీ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం జాంబాగ్ డివిజన్‌లో మమతా బెనర్జీ ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికాంత్, రామకృష్ణ, నర్సింగ్, రమాకాంత్ పాల్గొన్నారు.

‘ఆపరేషన్ ధూల్‌పేట్’ పై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న జాయింట్ కమిషనర్ ఖురేషీ తదితరులు

గన్‌ఫౌండ్రీ: పోలీసుల దాడులతో ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయదారులు పరారయ్యారని ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషీ అన్నారు. ధూల్‌పేట్ కార్యాలయంలో ఎక్సైజ్, పోలీసులు ఉన్నతాధికారులతో ధూల్‌పేట్ ఆపరేషన్‌పై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధూల్‌పేట్‌లో ప్రధాన నిందితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని మిగిలినవారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈ నెల చివరిలోగా దాడులు నిర్వహించి ధూల్‌పేట్‌లో గంజాయి లేకుండా చూసేలా పనిచేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, భాస్కర్, తులా శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి, సీఐలు మధుబాబు, గోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం


వాసు ముదిరాజ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

అబిడ్స్: కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వాసు ముదిరాజ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాసు ముదిరాజ్‌ను ఎమ్మెల్యే సత్కరించిన అనంతరం మాట్లాడారు.

కాంగ్రెస్ చేతల ప్రభుత్వం

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ అల్ హాజరీ అన్నారు. నియోజకవర్గానికి చెందిన నాయకులతో శనివారం కుల్సుంపురాలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హామీలను దశలవారీగా అమలు చేస్తున్నాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని ఆయనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కురాకుల కృష్ణ, చంటిబాబు, రఘుపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వేణుగౌడ్, కిషన్, అబీబ్, అమీద్ తదితరులు ఉన్నారు.


నాయకులతో ఉస్మాన్ హాజరీ

ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించాలి


ఇన్‌చార్జిలతో సమావేశమైన దక్షిణ మండలం డీసీపీ నేహా

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 40వ రోజు సందర్భంగా అర్బయిన్ ర్యాలీని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా సూచించారు. ఈ నెల 20వ తేదీన ర్యాలీ సందర్భంగా శనివారం దక్షిణ మండలం డీసీపీ కార్యాలయంలో ఆమె ఖిబ్లాస్, అంజుమన్‌ల ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలను పెద్దలకు సూచించారు. ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం


ఎమ్మెల్సీ కోదండరాంకు శుభాకాంక్షలు తెలుపుతున్న మైనార్టీ న్యాయవాదులు


ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానించిన బ్రిజ్‌రాజ్ సింగ్

అబిడ్స్: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరాంను గోషామహల్ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బ్రిజ్‌రాజ్ సింగ్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాది మహ్మద్ అసద్ అలీ నేతృత్వంలో..

నాంపల్లి: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరాంను న్యాయవాది మహ్మద్ అసద్ అలీ నేతృత్వంలో పలువురు ముస్లిం మైనార్టీ న్యాయవాదులు శనివారం ఎంజే మార్కెట్‌లోని టీజేఎస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మహ్మద్ అసద్ అలీ మాట్లాడుతూ..కోదండరాంను కేబినెట్‌లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్ ముజాహిద్, మతీన్ ఖాద్రీ, మహ్మద్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న సభ్యులు


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న నాగరాజు

గౌలిపురా: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను పాత బస్తీ దళిత చైతన్య వేదిక చైర్మన్ ఆదర్శ మహేశ్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ వర్గీకరణకు అలుపెరుగని పోరాటం చేశా సాధించారన్నారు. అనంతరం మందకృష్ణ మాదిగను పాతబస్తీకి ఆహ్వానించారు. సన్మానించిన వారిలో సభ్యులు జాలిగం చిరంజీవి, రవి కుమార్, పండరీనాథ్, మస్కు వేణు, సురేశ్ కుమార్, యాసారం సురేశ్ కుమార్, నరేశ్ జానీ, విజయ్‌తో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట నియోజకవర్గ నాయకులు..

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గ నాయకులు శనివారం మందకృష్ణ మాదిగను కలిశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింహా స్వామి మాదిగతో పాటు వర్కల నాగరాజు, బాబు, లడ్డూ, శ్రీధర్, రమేశ్ శాలువా కప్పి ధన్యవాదాలు తెలియజేశారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు..

జియాగూడ: మందకృష్ణ మాదిగను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు. వీఎస్.రాజు మాదిగ, కార్వాన్ నియోజకవర్గ కో ఇన్‌చార్జి మ్యాతరి చంద్రమోహన్, జియాగూడ నాయకులు గోపీ రామస్వామి మాదిగ, కంద్రు శ్రీనివాస్ మాదిగ, సందీప్ కుమార్ మాదిగ, ఎద్దుల శ్యామ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

విజయనగర్‌కాలనీ: అనుమానంతో భార్యపై కత్తితో దాడిచేసిన సంఘటన శనివారం ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్ హుడా కాలనీలో నివసించే వసంత్ (53) ఆటోడ్రైవర్. 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మొదటి భార్య అనారోగ్యానికి గురి కావడంతో ఏడాదిన్నర క్రితం జ్యోతి (28)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఇదిలా ఉండగా మద్యానికి బానిసైన వసంత్ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ నెల 16న అర్ధరాత్రి 12 గంటలకు నిద్రిస్తున్న భార్యపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ప్రాణభయంతో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి చూడగా కొట్టుమిట్టాడుతున్నది. సమాచారం అందుకున్న పోలీసులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శోభాయాత్ర

అబిడ్స్: శ్రావణమాసంలో ఉత్తరభారతీయులు నిర్వహించే మహా శివుడి శోభాయాత్ర జోరుగా కొనసాగింది. బేగంబజార్, ఛత్రీ, చుడిబజార్, గోషామహల్ ప్రాంతాల్లో వందలాది మంది భక్తులు మహా శివుడిని ఊరేగించారు.